క్లుప్తంగా

ఇంటింటి సర్వే పరిశీలన



సర్వేను పరిశీలిస్తున్న గుర్నులె నారాయణ

వాంకిడి: మండలంలోని లంజన్వీర గ్రామంలో కొనసాగుతున్న ఇంటింటి సర్వేను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్నులె నారాయణ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా సర్వేలో ఎలాంటి తప్పిదాలు లేకుండా చూసుకోవాలన్నారు. త్వరలో జరిగే గ్రామసభల ద్వారా అర్హుల జాబితాను ప్రకటించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు సన్మానం

రెబ్బెన: మండలంలోని నంబాలలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వర్కింగ్ జర్నలిస్టుల సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇటీవల మండలంలో ఎన్నికైన ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గంతో పాటు వర్కింగ్ జర్నలిస్టులను కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువాలతో సన్మానించారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

పెంచికల్‌పేట్: మండలంలోని కొండపల్లి గ్రామంలో పోచమ్మ బోనాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పూజారులు దేవర వినోద్, కొండ అశోక్ చారి ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు గ్రామంలోని వీధుల్లో భాజాభజంత్రీలతో ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారికి కొండపల్లి మాజీ సర్పంచ్ ఉపాసి సంజీవ్ -స్వాతి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్‌అర్బన్: సమ్మర్ సీజన్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు నూతన విద్యుత్ లైన్ పనులు జరుగుతున్నందున సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పట్టణంలోని టీఆర్‌నగర్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ లక్ష్మిరాజ్యం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు.

21 నుంచి గ్రామసభలు

రెబ్బెన: ప్రభుత్వం త్వరలో అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ రైతు ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరులో లబ్ధిదారుల ఎంపిక కోసం ఈనెల 21 నుంచి మండలంలో గ్రామ పంచాయతీల వారీగా గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శంకరమ్మ తెలిపారు. ఈనెల 21న రెబ్బెన, గంగాపూర్, కిష్టాపూర్, లక్ష్మీపూర్, పులికుంట, దర్మారం, 22న వంకులం, జక్కులపెల్లి, ఇందిరానగర్, మాద్యాయిగూడ, రోళ్లపాడు, నంబాల, 23న నవేగాం, రాంపూర్, కైరిగూడ, కొండపెల్లి, తుంగెడ, తక్కళ్లపల్లి, రాజారం, 24న కైరిగాం, నారాయణపూర్, గోలేటి, కొమురవెల్లి, పాశిగాం పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామసభలకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని కేజీబీవీలో ఖాళీగా ఉన్న గెస్ట్ హిందీ టీచర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేక అధికారి నలంద ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని కేజీబీవీలో హిందీ బోధించడానికి ఆసక్తి గల మహిళా అభ్యర్థులు ఈ నెల 21వ తేదీ లోపు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అర్హత హెచ్‌పీటీ, ఎంఏ హిందీ కలిగి, టెట్ అర్హత గల వారు స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, బయోడేటా ఫారంతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు మున్సిపల్ కార్యాలయం ముట్టడి

ఆసిఫాబాద్‌అర్బన్: మున్సిపల్ కార్మికులకు జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన ఆసిఫాబాద్ మున్సిపల్ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్మికులు ఉదయం 9 గంటలకు కార్యాలయానికి చేరుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కార్యవర్గం ఎన్నిక

ఇచ్చోడ: మండలంలోని తలమద్రిలో ఆదివారం ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని ఇచ్చోడ మండల ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి చిట్టి రవి, ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పసుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు.

కొంగు బంగారం 'గొంతెమ్మ'..!

- గౌతమి చెరువు ప్రాంతంలో వెలసిన ఆలయం
- గిరిజనుల ఆరాధ్య దైవం
- భక్తుల కోరికలను తీర్చే కల్పవల్లి
- నేడు బోనాల నిర్వహణకు ఏర్పాట్లు



సిద్ధేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న గిరిజనులు



మెరెగూడ సమీపంలో వెలసిన గొంతెమ్మ తల్లి

పెంచికల్‌పేట్: పచ్చని ప్రకృతి ఒడిలో మేరెగూడ గ్రామంలోని గౌతమి చెరువు సమీపంలో వెలసిన అతిపురాతన గొంతెమ్మ (కుంతి దేవి) ఆలయంలో బోనాల పండుగను సోమవారం నిర్వహించేందుకు గిరిజనులు ఏర్పాట్లు చేశారు. వేల సంవత్సరాల క్రితం వెలసిన గొంతెమ్మ తల్లి భక్తుల కోరికలను తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతోంది. ప్రతి ఏడాది ఆలయంలోని దేవతా మూర్తులను సుమారు 15 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజించి బోనాలు నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది.

ఆలయ చరిత్ర..

పూర్వకాలం పెద్దలు చెప్పిన ఆచారాల ప్రకారం దాదాపు 1000 సంవత్సరాల క్రితం పంచకళలచే ప్రసిద్ధికెక్కిన అల్లూరు అనే గ్రామం నేడు ఎల్లూర్ గ్రామంగా మారింది. పంచకళపురి క్షేత్రంలోని భద్రకాళీ ఆలయానికి, ప్రకృతి ఒడిలో వెలసిన సిద్ధేశ్వర స్వామి ఆలయాలకు మధ్య మేరెగూడ గ్రామంలో వెలసిన అతిపురాతన మహిమాన్విత గొంతెమ్మ ఆలయం కలదు. పూర్వం ఈ ప్రాంతాన్ని రాజ్‌గోండు రాజులు పరిపాలించగా ఆరాధ్య దైవం గొంతెమ్మను కొలిచేవారు. నాటి నుంచి నేటి వరకు అమ్మవారిని ఆరాధిస్తూ జగన్మాతను కొలుస్తూ బోనాల జాతర నిర్వహిస్తున్నారు.

గ్రామ దేవతల ఊరేగింపు..

ఆలయంలో గొంతెమ్మతో పాటు పంచపాండవులు, నీలవరుడు, పోతురాజు, లక్ష్మీదేవర, కృష్ణస్వామి, గిరిపోతుల విగ్రహాలు కొలువుదీరి ఉన్నాయి. జాతరలో భాగంగా ఈ విగ్రహాలను మండలంలోని అగర్‌గూడ, ఎల్లూర్, కోయచిచ్చాల, పెంచికల్‌పేట్, ఎల్కపల్లి, సంజీవనగర్, లోడుపల్లి గ్రామాల్లోని వీధుల్లో ఊరేగించారు. ఆయా గ్రామాల్లోని ప్రజలు అమ్మవారు చల్లగా చూడాలని సారె అందించారు. ప్రతిరోజు సాయంత్రం గ్రామంలో అమ్మవార్ల వేషధారణలో భాజాభజంత్రీలతో ఆటపాటలను ఏర్పాటు చేసి ఆలయ చరిత్రతో పాటు అమ్మవార్ల మహిమ వివరించారు.

సిద్ధేశ్వర ఆలయంలో పవిత్ర స్నానాలు..

గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించిన అనంతరం 13వ రోజున దట్టమైన అటవీప్రాంతంలో వెలసిన సిద్ధేశ్వర ఆలయ సమీపంలోని పవిత్ర నీటి గుండాల్లో దేవతా మూర్తులకు పవిత్ర స్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యం సమర్పించిన అనంతరం ఆలయంలో విగ్రహాలు కొలువుదీరాయి. 15వ రోజు సోమవారం భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించనున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దర్శనానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయంలో గిరిజనులు పూజారులుగా నీతి, నియమాలతో కనుల పండువగా జాతర నిర్వహిస్తారు.

మహిమ గల తల్లి



ఆలయంలో వెలసిన పురాతన గొంతెమ్మ తల్లి ఎంతో మహిమ గలది. పురాతన కాలం నుంచి ఆలయంలో మా కుటుంబానికి చెందిన వారే పూజార్లుగా తల్లిని కొలుస్తున్నాం. ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలతోనే అమ్మవారికి మొక్కులు చెల్లిస్తున్నాం.

– మానెపల్లి రాజన్న, ఆలయ ప్రధాన పూజారి

ఒంటికి, రెంటికీ తిప్పలు

- జీపీ కార్యాలయాల్లో కానరాని మరుగుదొడ్లు
- పంచాయతీ కార్యదర్శులు, ప్రజలకు తప్పని తిప్పలు



మరుగుదొడ్లు లేని వీర్దండి గ్రామ పంచాయతీ కార్యాలయం

కౌటాల: గ్రామ పంచాయతీ కార్యాలయాలకు మరుగుదొడ్లు లేక ప్రజలు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఇంటింటికీ మరుగుదొడ్లు నిర్మించుకోవాలని కోరుతున్న అధికార యంత్రాంగం పంచాయతీ కార్యాలయాలను మాత్రం పట్టించుకోవడం లేదు. మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఏటా పంచాయతీ ఎన్నికల్లో సగం మంది మహిళా ప్రజాప్రతినిధులే ఉంటున్నారు. కాని ఎక్కడ కూడా మరుగుదొడ్ల నిర్మాణాలు లేకపోవడంతో వారి కష్టాలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి.

సౌకర్యాలేవి..?

మండలంలో మొత్తం 20 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో కౌటాల, ముత్తంపేట, సాండ్‌గాం, తాటిపల్లి, గుండాయిపేట, పార్డీ, కనికి గ్రామ పంచాయతీల్లో మాత్రమే మరుగుదొడ్లు, మూత్రశాలలు ఉన్నాయి. మిగతా 13 పంచాయతీల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కొత్తగా ఏర్పాటైన తాటినగర్, నాగేపల్లి జీపీలతో పాటు వీరవెల్లి గ్రామ పంచాయతీలకు నూతన భవనాలను మంజూరు చేయగా నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. భాలేపల్లి, బోదంపల్లి, శీర్షా గ్రామ పంచాయతీ కార్యాలయాలకు ఇప్పటికీ సొంత భవనాలు లేవు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా గతంలో ప్రతీ పంచాయతీ కార్యాలయానికి మరుగుదొడ్ల నిర్మాణం కోసం అవసరమయ్యే ముడిసరుకును సమకూర్చారు. గత కొన్ని నెలలుగా పనులు ముందుకు సాగక మూలకు పడ్డాయి. గ్రామాల్లో వంద శాతం మరుగుదొడ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గడువు దాటినా ఇప్పటికీ నిర్మాణాలు చేపట్టలేకపోతున్నారు.

పంచాయతీలపై పట్టింపు కరువు

గ్రామాల్లో వంద శాతం మరుగుదొడ్లు నిర్మించేందుకు ఇటు గ్రామస్థాయి, అటు మండల స్థాయి ప్రజా ప్రతినిధులు కృషి చేస్తున్నారు. ఇదే స్ఫూర్తితో పంచాయతీల్లో మరుగుదొడ్ల నిర్మాణాలకు తొలి ప్రాధన్యమివ్వాలని పలువురు పేర్కొంటున్నారు. కాగా ప్రభుత్వం స్థానిక సంస్థల్లో, ఉద్యోగాల నియామకాల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించారు. గ్రామస్థాయిలో ఎన్నికైన మహిళా ప్రజాప్రతినిధులు, పని చేస్తున్న అధికారులు, సిబ్బందికి పంచాయతీ కార్యాలయాల్లో మరుగుదొడ్లు లేకపోవడంతో పడరాని పాట్లు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి నూతన పాలకవర్గ సభ్యులు ఎన్నికయ్యే లోగా పంచాయతీల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నిర్వాహక కమిటీ ప్రతినిధులు

ఆసిఫాబాద్‌అర్బన్: శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో ఫిబ్రవరి 16వ తేదీ ఆదివారం నిర్వహించే పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని నిర్వాహక కమిటీ సభ్యులు కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్‌లో నిర్వహించిన సమావేశంలో పూర్వ విద్యార్థుల కమిటీ ప్రతినిధులు మాట్లాడారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి హాజరయ్యే వారు 500 మంది వరకు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. సమావేశంలో కమిటీ ఉపాధ్యక్షులు వాసుదేవన శైలేశ్, కార్యదర్శి ఇరుకుల శ్రీనాథ్, సమన్వయ కమిటీ సభ్యులు నాగుల్ శ్రీనివాస్, శ్రీరాం సత్యనారాయణ, సిద్ధంశెట్టి క్రుపాల్, ప్రధాన ఆచార్యులు గుండేటి కోటేశ్వర్‌రావ్‌లు పాల్గొన్నారు.

సమత సైనిక్‌దళ్‌లో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న దుర్గం సిద్ధార్థ

వాంకిడి: యువకులు సమతా సైనిక్ దళ్‌లో భాగస్వాములై సమాజ సేవ చేయాలని సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం సిద్ధార్థ రాంమూర్తి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధవిహార్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలంటే ఎస్‌ఎస్‌డీ సైనికులుగా మారాలన్నారు. ప్రతీ ఒక్కరూ బుద్ధుడు, అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. త్వరలో జిల్లా వ్యాప్తంగా సమ సమాజ స్థాపనలో భాగంగా అనేక కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. ఫిబ్రవరి చివరి వారంలో ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా సామాజిక ఉద్యమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం కాగజ్‌నగర్, వాంకిడి, కౌటాల ప్రాంతాల్లో చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎస్‌ఎస్‌డీ సైనికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌డీ నాయకుడు, బీఎస్పీ చంద్రపూర్ జిల్లా ఇన్‌చార్జి సురేశ్ మేస్రం, బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్, నాయకులు దుర్గం సందీప్, విలాస్, రాజేంద్ర ప్రసాద్, చింటు, రాజేశ్వర్, మనోజ్ పాల్గొన్నారు.

సాగు భూములకే రైతుభరోసా

ఇచ్చోడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు సాగు భూములకు రైతుభరోసా ఇవ్వనున్నట్లు ఆర్ఐ హుస్సేన్ అన్నారు. ఆదివారం మండలంలోని గేర్జంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. గతంలో పట్టాపాసు పుస్తకంలో ఉన్న భూముల ఆధారంగా రైతు బంధు వచ్చేదని, ప్రసుతం వ్యవసాయ యోగ్యం ఉన్న భూములకు మాత్రమే రైతుభరోసా అందచేయనున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ భూములలో కట్టాడాలు, లే అవుట్లు, భవనాల నిర్మాణాలు, రోడ్లు ఇతర నిర్మాణాలు ఉంటే రైతుభరోసా రాదన్నారు. గ్రామ సభలో గ్రామస్తులు పాల్గొన్నారు.

సన్మానం

ఆదిలాబాద్‌రూరల్: ఇటీవల గ్రూప్- 4లో ప్రభుత్వ కొలువులు సాధించిన మాల కులస్తులను మాల సంక్షేమ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేశ్ మాట్లాడుతూ.. పోటీ ప్రపంచంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు పోటీపడి ఉద్యోగం సాధించడం గొప్ప విషయమని కొనియాడారు. కార్యక్రమంలో మేకల మల్లన్న, బొబ్బిలి సుధాకర్, గంపల ప్రభాకర్, ఏరా సుధీర్, ముల్కల్ల రాజేశ్వర్, బేర దేవన్న, సూరం భగవాండ్లు, సింగరి అశోక్, దాసరి బాబన్న, బోండ్ల వెంకటస్వామి, పాశం రాఘవేంద్ర, ముచ్చ రఘు పాల్గొన్నారు.

నేరడిగొండ: దుర్గామాత ఆలయ పంతులు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను ఆదివారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శాలువాతో ఘనంగా సన్మానించారు.

డ్యాన్స్ పోటీల్లో ప్రతిభ



బహుమతి అందుకుంటున్న మణికంఠ

బోథ్: హైదరాబాద్‌లో నిర్వహించిన ఓపెన్ డ్యాన్స్ పోటీల్లో మండలంలోని సొనాల గ్రామానికి చెందిన ఇర్ల మణికంఠ ఉత్తమ ప్రతిభ కనబర్చారు. పోటీల్లో అగ్ర స్థానంలో నిలిచి ఆదివారం బహుమతిని అందుకున్నారు. రఘు మాస్టర్ చేత బహుమతిని స్వీకరించారు. కాగా ఆయనను గ్రామస్తులు అభినందించారు.

సరిపడా గదులు లేక ఇక్కట్లు

- పిల్లర్ల దశలోనే నిలిచిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు
- ల్యాబ్‌లు సైతం తరగతి గదుల్లోనే నిర్వహణ
- ఇబ్బందులు పడుతున్న దహెగాం కళాశాల విద్యార్థులు



నిలిచిపోయిన అదనపు తరగతుల నిర్మాణం

దహెగాం: మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సరిపడా తరగతి గదులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఆరేళ్ల క్రితం లక్షల రూపాయల నిధులతో అదనపు గదుల నిర్మాణం చేపట్టినా అవి అసంపూర్తిగానే మిగిలిపోయాయి. కళాశాలలో బైపీసీ, సీఈసీ గ్రూపులు ఉండగా సుమారు 200 మంది వరకు విద్యార్థులు ఉన్నారు. ల్యాబ్‌ల కోసం గదులు లేక తరగతి గదుల్లోనే ప్రాక్టికల్స్ చేయాల్సిన పరిస్థితి నెలకొందని విద్యార్థులు వాపోతున్నారు. కళాశాల సిబ్బందికి సంబంధించిన ఆఫీస్‌రూం సైతం తరగతి గదిలోనే నిర్వహిస్తున్నారు. ఆరు సంవత్సరాలుగా నిర్మాణ దశలోనే అదనపు గదులు ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. పలుమార్లు అధికారులకు విన్నవించినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న గదులను పూర్తి చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

'సమస్యల పరిష్కారానికి కృషి'



అడేగామ(కె)లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

ఇచ్చోడ: గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని అడేగామ(కె) ఎస్సీ కాలనీలో పర్యటించి కాలనీ వాసులతో మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీలో తాగునీటి సమస్య ఉందని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. రెండు రోజుల్లో బోరు వేయించి కాలనీ వాసులకు తాగునీటి సమస్య లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల్లో సమస్యలు లేకుండా పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, ఇచ్చోడ మాజీ ఉపసర్పంచ్ లోక శిరీష్‌రెడ్డి నాయకులు గాడ్గే సూభాష్, పాండురంగ్, నర్వాడే రమేశ్, బద్దం రాంచెందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ

బోథ్: మండలంలోని పొచ్చెర గ్రామానికి చెందిన కలిగేటి సంటెన్న ఇటీవల మృతి చెందడంతో, విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదివారం మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఆటల్లో గెలుపోటములు సహజం

ఆటల్లో గెలుపోటములు సహజమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని పొచ్చెర గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌కు ఆయన హాజరయ్యారు. విజయం సాధించిన ఇచ్చోడ జట్టుకు విన్నింగ్ కప్‌తో పాటు రూ. 25 వేల బహుమతి అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన ఎన్‌ఎస్‌యూఐ జట్టుకు రూ. 15 వేలు అందజేశారు. యువత క్రీడాస్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు. కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అనుసంధానమెప్పుడో..?



సాగవుతున్న మొక్కజొన్న

- 'ఉపాధి'ని సాగుకు అనుసంధానిస్తే మేలు
- ఏటా వెంటాడుతున్న కూలీల కొరత
- అన్నదాతపై పెరుగుతున్న పెట్టుబడి భారం

నేరడిగొండ: ఆరుగాలం శ్రమిస్తూ దేశానికి అన్నం పెట్టే రైతన్నకు ఏటా సాగు కష్టాలు తప్పడం లేదు. ప్రధానంగా ప్రతీ సీజన్‌లో కూలీల కొరత వెంటాడుతోంది. ఇది పెట్టుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈక్రమంలో ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలంటూ రైతు సంఘాలు ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వాలకు విన్నవించాయి. నీతి ఆయోగ్ సైతం అనుసంధానమే అన్నదాతకు మేలంటూ తన నివేదికలో పేర్కొంది.

రైతులపై భారం..

వ్యవసాయ పనులకు ఉపాధిహామీ పథకం అనుసంధానం చేస్తే రైతులకు 30 శాతం మేలు చేకూరుతుందని మేధావులు, రాజకీయ అనుభవజ్ఞులు అభిప్రాయ పడుతున్నారు. కూలీల కొరత అధిగమించడంతో పాటు రైతులు అనేక రకాల పంటలు పండించేందుకు వీలు కలుగుతుంది. జిల్లాలో పత్తి సాగు విస్తీర్ణమే అధికం. పంట చేతికి వచ్చిన తర్వాత పత్తి ఏరేందుకు కూలీల కొరత సమస్య ఏటా వెంటాడుతూనే ఉంది. ఈ క్రమంలో కూలి పెంపు తప్పనిసరవుతోంది. కూలీలను పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి ఆటోలు, జీపుల్లో తీసుకురావాల్సిన దుస్థితి. వారికి కూలితో పాటు రానుపోనూ చార్జీలు సైతం రైతులే చెల్లించాల్సి వస్తోంది. అన్నదాతపై పెట్టుబడి భారం పెరుగుతోంది. మరోవైపు గిట్టుబాటు ధర అందకపోవడం, తేమ పేరిట కోతలు ఏటా పరిపాటిగా మారాయి.

రైతులకు మేలు..

ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానిస్తే రైతులకు మేలు జరుగుతుంది. విత్తనాలు వేయడం, పత్తి ఏరడం, పంట సాగులో ఇతరత్రా పనులకు ఉపాధి కూలీలను ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. కూలీలకు సైతం ఏడాది పాటు ఉపాధి దొరుకుతుంది. ఇప్పటికే ఈ పథకం ద్వారా వ్యవసాయంలో పలు పనులు చేర్చారు. పూర్తిస్థాయిలో అనుసందానిస్తే ఇటు రైతులకు, అటు కూలీలకు లాభం చేకూరుతుంది.

కూలీల కొరత..



ప్రతిఏటా కూలీల కొరత తీవ్రంగా ఉంటుంది. పత్తి తీయడం ఇబ్బందవుతుంది. దీంతో పక్క రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి కూలీలను తీసుకువస్తున్నారు. వారు రావడానికి, తిరిగి వెళ్లడానికి ఆటో చార్జీలు సైతం చెల్లిస్తున్నారు. వ్యవసాయానికి ఉపాధిహామీ పథకాన్ని అనుసంధానిస్తే కూలీల కొరత ఉండదు.

– సంగెపు బొర్రన్న, రైతు స్వరాజ్య వేదిక, జిల్లా అధ్యక్షుడు, ఆదిలాబాద్

ఆశాజనకంగా శనగపంట



ఈ ఏడాది యాసంగి సీజన్‌లో రైతులు సాగు చేసిన శనగ పంట ఆశాజనకంగా ఉంది. ప్రస్తుతం కాత దశలో ఉన్న శనగపంటకు వాతావరణం అనుకూలంగా ఉండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తాంసి, భీంపూర్ మండలాల్లో అధికంగా రైతులు శనగపంట సాగు చేశారు. పంటకు తెగుళ్ల బెడద, పురుగు ఉధృతి లేకపోవడంతో ఆశించిన దిగుబడి వచ్చేలా ఉందని ఆశలు పెట్టుకున్నారు. మరో నెల రోజుల్లో పంట చేతికి వచ్చే అవకాశం ఉంది. - తాంసి

రైతు ఆత్మహత్య బాధాకరం

బేల: రేణుగూడ గ్రామానికి చెందిన రైతు జాదవ్ దేవ్‌రావు ఆత్మహత్య బాధాకరమని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. రైతు అంత్యక్రియలు ఆదివారం నిర్వహించగా ఆయన పాల్గొన్నారు.